తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## వృద్ధ దంపతుల హత్య కేసులో ముగ్గురు అరెస్ట్ : డిఎస్పీ

### నిందితుల్లో కొడుకు, కోడలు.. మైనర్ మనవడు !!



కుప్పం, జూలై 20 ప్రభాతవార్త

రామకుప్పం మండలం బందార్లపల్లి గ్రామ సమీపంలో ఈనెల 17వతేది రాత్రి వృద్ధ దంపతులు దారుణహత్య కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. ఈనెల 17వతేది రాత్రి వృద్ధదంపతులు అయిన వెంకటేశు (70), పార్వతమ్మ (65)లు టు వీలర్‌లో రామకుప్పం నుంచి స్వగ్రామం వస్తుండగా హత్యకు గురయ్యారన్నారు. ఈ కేసుకు సంబంధించి మూడు బృందాలు విచారించగా ఈ సంఘటనకు బాధ్యులుగా వృద్ధ దంపతుల పెద్దకుమారుడు, కోడలు, వారి కుమారుడు అయిన మైనర్ బాలుడు నిందితులుగా నిర్ధారించామన్నారు. ఆస్తి తగాదాల నేపథ్యంలో వృద్ధదంపతులను హతమార్చారని డిఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై వెంకటమోహన్ పాల్గొన్నారు.

## పిల్లలు పుట్టలేదని ఆత్మహత్య



రొంపిచెర్ల, జూలై 20 ప్రభాతవార్త

పిల్లలు పుట్టలేదని భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన మల్లెల ముస్తాన్ (26) అజుంతుల్లా దంపతులకు 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అయితే వారికి పిల్లలు జన్మించ లేదు. ఈ విషయమై మానసిక వేదనతో ఆదివారం రాత్రి ఇంట్లో భర్త లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ సోమవారం తెలిపారు.

## గ్రామాల్లో చెత్త నిర్వహణకు కొత్త విధానం అమలు





తిరుపతి రూరల్, జూలై 20 ప్రభాతవార్త :

గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రతను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణ 2026 మార్గదర్శకాలను విడుదల చేసింది. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఈ మార్గదర్శకాలు గ్రామాల్లో చెత్త సేకరణ, వర్గీకరణ, ప్రాసెసింగ్ వ్యవస్థను సమగ్రంగా మార్చేలా రూపొందించబడ్డాయి. ఇందులో భాగంగా ప్రతి కుటుంబం చెత్తను తడి, పొడి, సానిటరీ, హానికర వ్యర్థాలుగా నాలుగు రకాలుగా విభజించడం తప్పనిసరి చేశారు. తడి చెత్తను బిన్‌లో, పొడి చెత్తను బ్యాగ్‌లో ఇవ్వాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విధానం అమలుకు గ్రామాల్లో 45 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ప్రారంభంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ఇంటింటికి అమలు చేయించి, చివర్లో కఠిన పర్యవేక్షణ చేపడతారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారు. తడి చెత్తను వినియోగిస్తూ ప్రతి గ్రామంలో కనీసం మూడు వెర్మీ కంపోస్ట్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటి ద్వారా సేంద్రీయ ఎరువులు తయారు చేసి గ్రామాల ఆదాయాన్ని పెంచే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.7,000 వరకు ప్రోత్సాహకం అందించనున్నారు. పంచాయతీల పనితీరును బట్టి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. కుటుంబాల సంఖ్య ఆధారంగా 50 నుంచి 75 శాతం వరకు ప్రోత్సాహకాలు ఉండగా, ఉత్తమంగా పనితీరు కనబరిచిన గ్రామాలకు అదనపు ప్రయోజనాలు కల్పి స్తారు. అలాగే పంచాయతీలకు ఎ ప్లస్, ఎ,బి,సి,డి గ్రేడింగ్ విధానం అమలు చేయనున్నారు. 100 శాతం లక్ష్యసాధన చేసిన పంచాయతీలకు ఎ ప్లస్ గ్రేడ్ ఇవ్వనున్నారు. పెద్ద స్థాయిలో చెత్త ఉత్పత్తి చేసే హోటళ్లు, ఫంక్షన్ హాల్స్ వంటి సంస్థలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠిన నిషేధాన్ని అమలు చేస్తూ ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించనున్నారు. అదేవిధంగా ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను అభివృద్ధి చేస్తూ ప్రతి 1000 జనాభాకు వెర్మీ యూనిట్లు, సోలార్ లైటింగ్, నీటి సౌకర్యాలు కల్పించనున్నారు. చెత్త సేకరణ, రవాణా కోసం ప్రత్యేక వాహనాలు, పుష్ కార్ట్స్ వినియోగాన్ని పెంచనున్నారు. గ్రామాలను శుభ్రం గా, పర్యావరణహితంగా మార్చడంతో పాటు చెత్తను సంపదగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సరైన అమలు జరిగితే గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రతతో పాటు ఆదాయ వనరులు పెరగనున్నాయి.

## విద్యా సంస్కరణలకు షైనింగ్ స్టార్స్ ప్రతీక

**విద్యార్థుల విజయమే రాష్ట్ర ప్రగతికి పునాది: మంత్రి అనగాని - మార్కులతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యం: కలెక్టర్**

**258 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు.. - ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు సమాన గుర్తింపు**



తిరుపతి విద్య, జూలై 20 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న సంస్కరణలకు షైనింగ్ స్టార్స్-2026 కార్యక్రమం నిదర్శనమని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రిజిస్ట్రేషన్-రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పురస్కారాలు, పతకాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యావంతమైన నాయకత్వం ఉంటే విద్యారంగంలో ఎంతటి మార్పులు సాధ్యమవుతాయో షైనింగ్ స్టార్స్ కార్యక్రమమే ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, నాణ్యమైన విద్యను అందించడం, విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం పునరుద్ధరణ, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలు విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని వివరించారు. ఈ నెల 24న నిర్వహించే తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలకు ప్రతి తల్లిదండ్రి తప్పనిసరిగా హాజరై పిల్లల విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. గతంలో కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే పరిమితమైన ప్రతిభా పురస్కారాలను ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ప్రతిభావంతులైన 258 మంది విద్యార్థులను ఒకే వేదికపై సత్కరించడం విద్యారంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే సమాజ అభివృద్ధికి నిజమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రెండు చక్రాల్లాంటి వారని, వారి సమిష్టి కృషితోనే ఉన్నత ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. మార్కులే విజయానికి కొలమానం కాదని, వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నైపుణ్యాలు కూడా సమానంగా అవసరమన్నారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తల్లిదండ్రులు పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యారంగంలో అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. షైనింగ్ స్టార్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించి మరింత ప్రతిభ కనబర్చేందుకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, ఆర్ఐఓ గోపాల్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్కారం పొందిన విద్యార్థులను అభినందించిన అతిథులు, భవిష్యత్తులో వారు రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

## సమస్యలకు సత్వర పరిష్కారం

### - అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:

ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 264 సమస్యలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై ఇది వరకు వచ్చి పెండింగ్‌లో వున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని ప్రజలకు న్యాయం జరిగేలా పరిశీలించి నిర్దేశిత కాల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. అలాగే రెవెన్యూ సమస్యలపై ఫోకస్ చేసి రైతుల రీ-సర్వే, భూసమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించడానికి దృష్టి పెట్టాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యారంగం నిర్వీర్యం

### - సత్వరం పెండింగ్‌లో వున్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు విడుదలకు చర్యలు



చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:

రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని, పెండింగ్‌లో వున్న విద్యార్థులు ఫీజు రీఎంబర్స్‌మెంట్ 6,400 కోట్ల రూపాయల బకాయిలను సత్వరం విడుదల చేయాలడి డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఎఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది విద్యార్థులకు బకాయిపడ్డ ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ మొత్తాలు జమ కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. కళాశాలలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తుంటే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల చదువులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి భవిష్యత్తును అంధకారంలో నెట్టడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మున్నా, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, యామిని, నగర ఎఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్, జీవిత, ప్రణవి, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపిలో 150 కుటుంబాలు చేరిక



రైల్వే కోడూరు అర్బన్, జులై 20 ప్రభాతవార్త.

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి పార్టీ కార్యాలయంలో సోమవారం రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, కూడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి, యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఓబులవారిపల్లి మండలానికి చెందిన చిన్న ఓరుం పాడు పంచాయతీ కమ్మపల్లి హరిజనవాడ జ్ఞానం పల్లి, అరుంధతివాడ, హరిజనవాడ కు చెందిన సుమారు 150 కుటుంబాలు వైసిపి పార్టీని వీడి టిడిపి పార్టీలో చేరారు. ఈ చేరికలలో భాగంగా మొదటగా పార్టీల్లో చేరుతున్నటువంటి గ్రామస్తులతో ముక్కా రూపానంద రెడ్డి సమావేశమై వారికి అండగా ఉంటానని భరోసానిచ్చి అనంతరం ఒక్కొక్కరికి టిడిపి పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. చ అనంతరం ముక్కారూపానంద రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లా పరిపాలనకు, రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధి చూసి ఆకర్షితులై నేడు పార్టీలో చేరారని తెలిపారు. వారికి ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు.

## కన్నుల పండువగా కల్యాణ వెంకన్న పార్వేట ఉత్సవం





చంద్రగిరి, జూలై 20 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి పార్వేట ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలోని పార్వేట మండపం వద్ద సోమవారం అర్చకులు స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు ఆలయం నుండి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకువచ్చారు. క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బళ్ళెంను ప్రయోగించారు. తదుపరి స్వామివారికి ఆస్థానం సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్వమూర్తులను తిరిగి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జెఇఓ డాక్టర్ ఎ.శరుత్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, బాలాజీ రంగకుమార్, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలనే పూజిద్దాం

### నిమజ్జన మహోత్సవ కమిటీ



తిరుపతి,జులై 20ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రానున్న వినాయకచవితి పర్వదినాన మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలనే పూజిద్దామని వినాయక నిమజ్జన మహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిస్తూ సోమవారం కపిలతీర్థం వద్ద ఉన్న అక్షయపాత్ర రాధాకృష్ణ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి ,ఎస్వీఎం వెంకటేష్,గుండాల గోపీనాథ్ రెడ్డి,కరాటే శీను ,వెంకట్ రాయల్ తదితరులు ప్రసంగించారు ఈ సమావేశానికి వేణుగోపాల్ నాయుడు,సాకం ప్రభాకర్,నటరాజ్,డిపి ఆనంద్,గోపి ప్రసాద్,మణికంఠ,వాసు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆదంఅనిల్ రెడ్డి,దీపక్ యాదవ్,పార్థసారథి,చంద్రశేఖర్, షణ్ముగం రాయల్,భాస్కర్ నాయుడు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా స్వీకరించి రాబోయే వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరు కూడా మట్టి విగ్రహాలను పూజించాలని పర్యావరణాన్ని కాపాడాలని నగరంలో ఏర్పాటు చేసే మండపం నిర్వాహకులకు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సముద్ర జలాలలో వచ్చిన "ఎల్నినో" కాలుష్యం కారణంగా దేశవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గిపోయిందని భవిష్యత్ తరాల వారి కోసం పర్యావరణానికి ఎటువంటి ముప్పు కలగకుండా రసాయనాలతో తయారుచేసిన భారీ వినాయకుని విగ్రహాలను వినియోగించకుండా "పార్వతీపుత్ర పర్యావరణ మిత్ర" అన్న నినాదంతో మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలతో మాత్రమే ప్రతి ఒక్కరు పూజించాలన్నారు వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలో ఏర్పాటు చేసే మండప నిర్వాహకులకు ముందస్తుగా పర్యావరణం పై అవగాహన కల్పించేందుకు వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీతో పాటు ప్రభుత్వ శాఖలను స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు.

## 'స్థితిస్థాపకత సుస్థిరత కోసం నిర్మాణం'

### తిరుపతి ఐఐటిలో మూడు రోజుల వర్క్‌షాప్



శ్రీకాళహస్తి, జూలై 20 ప్రభాతవార్త

"స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం మరియు సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తంతో మూడు రోజుల అంతర్జాతీయ సమావేశాన్ని సోమవారం తిరుపతి ఐఐటిలో శ్రీకారం చుట్టారు. నేడు సమాజంలో అవసరమైన జియోస్పేషియల్ టెక్నాలజీలు మరియు దాని అనువర్తనాలపై 5వ బ్రిక్స్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి ఐఐటి తిరుపతి ఆతిథ్యం ఇచ్చింది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో, తిరుపతి ఐఐటి నవవిష్కర్ 1హబ్ ఫౌండేషన్ సహకారంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జియోస్పేషియల్ టెక్నాలజీలు అనువర్తనాలపై బ్రిక్స్ వర్కింగ్ గ్రూప్ 5వ సమావేశాన్ని సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ భవనంలో విజయవంతంగా నిర్వహిస్తుంది. "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం మరియు సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తంతో నిర్వహించబడిన ఈ మూడు రోజుల అంతర్జాతీయ సమావేశం, సమకాలీన ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో మరియు సుస్థిర అభివృద్ధిని పెంపొందించడంలో జియోస్పేషియల్ టెక్నాలజీల పాత్రపై చర్చించడానికి బ్రిక్స్ దేశాలు, భాగస్వామ్య దేశాల నుండి విధాన రూపకర్తలు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశ్రమల నాయకులు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలను ఒకచోట చేర్చింది. బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, దక్షిణాఫ్రికా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధులు వర్చువల్‌గా పాల్గొనడంతో ఈ సమావేశం హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించబడింది. దక్షిణాఫ్రికా నుండి ఇద్దరు ప్రతినిధులు ఈ కార్యక్రమానికి వ్యక్తిగతంగా హాజరయ్యారు, ఇది జియోస్పేషియల్ టెక్నాలజీల రంగంలో బ్రిక్స్ దేశాల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యాన్ని ప్రతిబింబించింది. దీప ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఎన్. సత్యనారాయణ; శాస్త్ర, సాంకేతిక శాఖ అండర్ సెక్రటరీ శ్రీ గౌతమ్ గోవింద్; సైంటిస్ట్ నేషనల్ జియోస్పేషియల్ ప్రోగ్రామ్ డివిజన్ హెడ్ డాక్టర్ మనోరంజన్ మొహంతి; డిఎస్‌టిలోని సైంటిస్ట్ డాక్టర్ శుభా పాండే; డిఎస్‌టిలోని సైంటిస్ట్ డాక్టర్ అరిందమ్ భట్టాచార్య తదితర ప్రముఖులు హాజరయ్యారు. బ్రిక్స్ దేశాలలో జియోస్పేషియల్ ఎకోసిస్టమ్‌లను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ సహకారం మరియు సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను ప్రముఖులు నొక్కి చెప్పారు.

**వ్యవసాయం మరియు విపత్తు నిర్వహణ;**

విద్యా, ప్రభుత్వ, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులు డాక్టర్ వి. కె. దధ్వాల్, మేజర్ జనరల్ డాక్టర్ బి. నాగరాజన్, ఎయిర్ వైస్ మార్షల్ (రిటైర్డ్) పవన్ కుమార్, ప్రొఫెసర్ ఓంకార్ దీక్షిత్, ప్రొఫెసర్ కె. ఎస్. రాజన్, డాక్టర్ శుభా పాండే, శ్రీ పంకజ్ మిశ్రా, ఐఐటి బొంబాయిలోని సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ రిసోర్సెస్ ఇంజనీరింగ్ ( సి ఎస్ ఆర్ ఈ ) ప్రొఫెసర్ హెడ్ డాక్టర్ సూర్య దుర్భాతో సహా పలువురు సాంకేతిక సమావేశాలకు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలోని మరో ప్రధాన ఆకర్షణ "ఆపరేషన్ ద్రోణగిరి: స్టార్టప్ విజయ గాథలు". ఇందులో ప్రభుత్వ మద్దతు మరియు సంస్థాగత ఇంక్యుబేషన్ పర్యావరణ వ్యవస్థల ద్వారా సాధ్యమైన అత్యాధునిక పరిష్కారాలు, విజయవంతమైన వాణిజ్యీకరణ ప్రయాణాలను ప్రదర్శిస్తూ, స్టార్టప్ ప్రజెంటేషన్లు మరియు లైట్నింగ్ పిచ్‌ల శ్రేణిని నిర్వహించారు. ఈ సెషన్ బ్రిక్స్ ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి మరియు వ్యవస్థాపక భాగస్వామ్యాలను పెంపొందించడానికి ఒక ముఖ్యమైన వేదికను అందించింది. ఈ కార్యక్రమంలో యంగ్ జియోస్పేషియల్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రామ్ కూడా భాగంగా ఉంది, దీనిలో పాఠశాల విద్యార్థులు స్థానిక సవాళ్లను పరిష్కరించడానికి జియోస్పేషియల్ టెక్నాలజీల వినూత్న అనువర్తనాలను ప్రదర్శించారు. బ్రిక్స్ దేశాలు మరియు ప్రపంచ సమాజ ప్రయోజనం కోసం శాస్త్రీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి, ఆవిష్కరణఆధారిత అభివృద్ధిని ప్రోత్సహించడానికి, మరియు స్థితిస్థాపక, సుస్థిర భౌగోళిక మౌలిక సదుపాయాలను నిర్మించడానికి నూతన నిబద్ధతతో 5వ బ్రిక్స్ వర్కింగ్ గ్రూప్ సమావేశం ముగిసింది.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### – కడ పి.డి. వికాస్ మర్మత్ – పిజిఆర్ఎస్‌లో 48 వినతులు స్వీకరణ !!



కుప్పం, జూలై 20 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చూపరాదని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 48వినతిపత్రాలను పి.డి.కి అందించారు. వీటిని శాఖల వారీగా పరిష్కారంకు అప్పగించారు. అనంతరం కడ పి.డి. మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు పారదర్శక, వేగవంతమైన పాలన అందించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లాలని సిఎం పనిచేస్తున్నా రన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు కూడా పనిచేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరిం చాలన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు రమేష్‌బాబు, సీతారా ం, డిఇలు దస్తగిరి, పురుషోత్తం, గురవారెడ్డి,ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిటెక్ సెకండ్ సెమిస్టర్ టాపర్ల జాబితా విడుదల

కుప్పం, జూలై 20 ప్రభాతవార్త



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్)లో బిటెక్ సెకండియర్ సెకండ్ సెమిస్టర్ ఫలితాల్లో టాపర్ల జాబితాను సోమవారం వర్సిటీ నామినీ చేతుల మీదుగా విడుదల చేశారు. భావన 94.30శాతం మార్కులతో ప్రథమస్థానం, ఉమాశ్రీ 93.00శాతంతో రెండో స్థానం, సంజన 92.44శాతంమార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారంతో కళాశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తోందన్నారు. ఈసందర్భంగా టాపర్లను అభినందించారు.అధ్యాపకులు పాల్గొన్నారు.

## గుండెచికిత్స వైద్య శిబిరం విజయవంతం

కుప్పం,జూలై 20 ప్రభాతవార్త



బిఆర్‌డి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, బెంగళూరు కావేరి హాస్పిటల్ వారిచే సోమవారం బిఆర్‌డి ఆస్పత్రిలో నిర్వహించిన గుండెచికిత్స వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అరుల్ జ్ఞాన షణ్ముగం సుమారు 76మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు రెండువేల దాకా ఖర్చయ్యేఇసిజి,2డి ఎకో, బిపి, చక్కెర వ్యాధి పరీక్షలను కేవలం రూ 600 లకే నిర్వహించారు. ప్రతినెల మూడో శనివారం కార్డియాలజీ క్యాంప్ నిర్వహిస్తామని ఛైర్మన్ తెలిపారు.

## మున్సిపల్ కమిషనర్‌కు ఘనసన్మానం

కుప్పం, జూలై 20 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయిలో ఆపరేషన్ క్లీన్‌స్వీప్ కార్యక్రమంలో కుప్పం మున్సిపాలిటీ రెండోస్థానంలో నిలిచి సిఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అవార్డు అందుకున్న విషయం విదితమే. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు జిమ్‌దాము, సురేష్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కుమార్, కార్పోరేషన్ డైరెక్టర్ వినోద్, మాజీ ఎంపిటిసి ఉమాపతి నాయుడు తదితరులు ఘనంగా సత్కరించారు.

## కోనేరుకుప్పంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

శాంతిపురం, జూలై 20 ప్రభాతవార్త



మండలంలోని కోనేరుకుప్పం గ్రామంలో ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ అధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో చెత్తచెదారాలు పేరుకుపోయాయని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా సోమవారం ఎంపిడిఓ గ్రామంలో పర్యటించారు. పురాతన కోనేరులో చెత్త వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. దీనిపై ఎంపిడిఓ స్పందించి కోనేరును శుభ్రపరచేందుకు చర్యలు చేపడ్తామన్నారు. డ్రైన్లను సైతం శుభ్రం చేయాలని ఎంపిడిఓ అధికారులను ఆదేశించారు. అనంతరం తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, చెత్తసేకరణ, పెన్షన్ల పంపిణీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప ఎంపిడిఓ రవినాయక్, పిడిఓ ప్రభాకర్, నేతలు లక్ష్మీనారాయణ, సత్యంనాయుడు, అర్జునప్ప, కాంతప్ప పాల్గొన్నారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 52 సమస్యలు

చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యా లయంలో సోమవారం ఎస్పీ తుషార్ దూడి ఆద్వర్యంలో నిర్వ హించిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు ప్రజల నుండి 52 సమస్యలు అందాయి. ప్రజల నుండి అందిన సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి సత్వరం చర్యలు తీసుకోవాలని ఎప్పీ తుషార్ దూడి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాన్ కేడర్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్.షాను, చిత్తూరు డిఎస్పీ జి.వెంకటనారాయణలు హాజరై ప్రజల నుండి అర్జీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చీటింగ్‌కు సంబంధించి 9, చిన్న గొడవలపై 8, డబ్బు తగాదాలు 8, భూ తగాదాలు 8, ఇంటి తగాదాలు 8, వేధింపులు 5, ఆస్తి తగాదాలకు సంబంధించి 6 సమస్యలు అందాయి.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న విశ్వం పాఠశాల విద్యార్థిని



గంగాధర నెల్లూరు, జూలై 20 ప్రభాత వార్త:

సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ ఆవరణలో నిర్వహించిన షైనింగ్ స్టార్ అవార్డుల ప్రధానోత్సవంలో మండలంలోని విశ్వం పాఠశాలలో చదువుతూ పదవ తరగతి ఫలితాలలో మండలంలోని అత్యధిక మార్కులు సాధించిన డి హాసినికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చూడా ఛైర్మెన్ కటారి హేమలత సంయుక్తంగా షైనింగ్ స్టార్ అవార్డును అందించారు.మండలానికి చదివిన పాఠశాలకు తల్లితండ్రులకు గౌరవం తీసుకొచ్చిన డి హాసినిని పాఠశాల కరస్పాండెంట్ జయచంద్రా రెడ్డి ప్రిన్సిపల్ చిట్టిబాబులతో పాటు పలువురు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిఈఓ లక్ష్మీనారాయణ అన్ని మండలాల ఎంఈఓలు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారంలో వీఆర్వోలు, సర్వేయర్లు చొరవ చూపాలి

**పూతలపట్టు, జూలై 20, ప్రభాతవార్త** పూతలపట్టు మండల తహసీల్దార్ వీఆర్వోలు, సర్వేయర్లతో ప్రజలకు సంబంధించిన భూ సమస్యలు, రెవెన్యూ సేవల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తాసిల్దార్ ఉదయ సంతోష్ సూచించారు. వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. భూ సర్వేలు, సరిహద్దు వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్‌లు, మ్యుటేషన్ తదితర అంశాల్లో పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పిండమే లక్ష్యం

### మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న



పలమనేరు, జూలై 20 ప్రభాతవార్త:

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యమని పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో వివిధ రకాల పంటల ధరలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తీసుకు వచ్చే పంటల నాణ్యతను బట్టి గిట్టుబాటు ధరలు ఉంటుందని తెలిపారు. మండీ యజమానులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతియుతంగా వ్యాపారం చేసుకునేందుకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు. రైతులు, వ్యాపారులు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. ప్రస్తుతం టమోటా నాణ్యతను బట్టి మంచి ధరలు లభి స్తున్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ సంజీవ సుకుమార్ సిబ్బంది పలువురు రైతులు వ్యాపారులు పాల్గొన్నారు.

## లారీ , బొలెరో వాహనం ఢీ




రామకుప్పం, జూలై 20 ప్రభాతవార్త

మండల శివార్లలోని కర్ణాటక రాజుపేట రోడ్డు పలమనేరు కుప్పం జాతీయ రహదారిలో లారీ, బొలెరో ఢీకొన్నాయి. సోమవారం ఉదయం కుప్పం నుంచి వస్తున్న లారీ, రాజుపేట రోడ్డు వే బ్రిడ్జి నుంచి కుప్పం వైపు వెళ్తున్న బొలెరో ఓవర్టేక్ చేస్తూ వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. లారీని ఢీకొనడంతో డీజిల్ ట్యాంకు ప్రమాదానికి గురైంది. డీజిల్ రోడ్డుపై ప్రవహించడంతో కర్ణాటక అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని నీటితో శుద్ధి చేశారు. బొలెరో వాహనం ముందుభాగం ఢీకొనడంతో నుజ్జు నుజ్జు అయింది. లారీ డ్రైవర్ కు కాలు విరిగింది. బొలెరో డ్రైవర్ కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పెద్ద ప్రమాదం తప్పిందని వాహనదారులు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## పేదరిక నిర్మూలనే సీఎం చంద్రబాబు లక్ష్యం



రామకుప్పం, జూలై 20 ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పేదరిక నిర్మూలన లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు అందిస్తున్నారని టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జ్ రవిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ ద్వారా ప్రమీలమ్మకు తోపుడు బండి 30 వేలు, ఇంద్రాణి మహిళకు పాడి ఆవు కొనుగోలుకు 75 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. మండలంలో నిరుపేదలను గుర్తించి వారికి ప్రోత్సాహకాలు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ వినాయక రెడ్డి, బంగారు మిత్ర లావణ్య, నేతలు రామకృష్ణప్ప, పద్మనాభ రెడ్డి, మంజునాథ్, బాలరాజు,అల్లిశీన,సుబ్రిదయానంద,ఆదిల్, హరి, రమేష్, మోహన్ , పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టకు భూమిపూజ

కుప్పం, జూలై 20 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లి గ్రామంలో 14 ఏళ్లుగా నిలిచిపోయిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టకు సంబంధించి వివాదంకు నేతలు ముగింపు పలికారు. సోమవారం విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో అన్ని కులాల పెద్దలు, ప్రజలతో చర్చించి సమస్యను సానుకూలంగా పరిష్కరించినట్లు నేతలు తెలిపారు. సమాజంలో సామరస్యం, సమానత్వం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘన ంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, దళిత యువజనసేవా సమితి అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, నేతలు మురుగప ్ప, రాజప ్ప, మురళి, ప్రదీప్, రఘుపతి, తిమ్మరాయ, చలపతి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంకే ప్రజాదర్బార్

### – ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, జూలై 20 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కారంకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం తెదేపా కార్యాలయంలో ఆయన తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహంకు పూజలు చేసి నివాళులు అర్పించిన అనంతరం ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు వ్యక్తిగత, భూ సమస్యలను వివరించారు. సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి విజ్ఞప్తిపై అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, కడ సభ్యుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, రెస్కో డైరెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## 3 నుండి 8 వరకు ఆడికృత్తిక ఉత్సవాలు

### నేడు దుకాణాల వేలం పాటలు

పలమనేరు, జూలై 20, ప్రభాతవార్త:

పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని టిఎస్ అగ్రహారంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో ఆగస్టు 3 నుండి 8 వరకు ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఓ, కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 21న మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు వేలం పాటలు ఉంటాయన్నారు. దుకాణాలకు గేటు వసూలు చేసుకోవడం, తలనీలాలు టికెట్లు అమ్ముకోవడంపై వేలం పాటలు నిర్వహిస్తామని తెలిపారు. పాల్గొనువారు రూ.వెయ్యి ధరావత్తు చెల్లించాలని, వేలం పాటలు పూర్తి అయిన వెంటనే హెచ్చు పాట దారులు మొత్తం చెల్లించి రసీదు పొందాలని సూచించారు. మిగిలిన షరతులు వేలం పాటలకు ముందు తెలియ జేస్తామని తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## సత్వరం కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా

### – ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చిత్తూరులో భారీ నిరసన ర్యాలీ



చిత్తూరుహెల్త్, జులై 20 ప్రభాతవార్త:

నీట్ ప్రశ్నాపత్రం లీక్ చేసి దేశంలోని లక్షలాది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చిత్తూరులో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు వివేకానంద విగ్రహం నుండి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ నిరసన ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై సత్వరం కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనపై బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గత 23 రోజులుగా దేశ రాజధాని న్యూఢిల్లీలో వాంగ్ చుక్ నిరాహారదీక్ష చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు యశ్వంత్, లోహిత్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వేగంగా చెరువుల సుందరీకరణ పనులు

### – ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:

నగర పరిధిలోని కట్టమంచి చెరువు, గంగినేనిచెరువుల పరిసరాల్లో సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సోమవారం నగర పాలకసంస్థ అధికారులతో పాటు ఇరిగేషన్, పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కట్టమంచి చెరువు, గంగినేని చెరువులను పరిశీలించారు. కట్టమంచి చెరువు పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కట్టమంచి చెరువు కట్టపై రెండు వరుసల దారిలో ఫుడ్ కోర్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అక్కడ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కట్టకు ఇరువైపులా శుభ్రం చేయించాలన్నారు. గంగినేని చెరువు అభివృద్ధికి సంబంధించిన పనుల పురోగతిపై ఎమ్మెల్యే గురజాల పబ్లిక్‌హెల్త్, ఇరిగేషన్ అధికారులతో గంగినేని చెరువు పరిసరాల్లో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులో మురుగునీరు కలవకుండా కాలువల నిర్మాణం, ఇతరత్రా నిర్దేశించిన పనులను త్వరితంగా చేపట్టి పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అక్కడ చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, టిపిఓ నాగేంద్ర, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిశీలించి పరిష్కారం

చిత్తూరుహెల్త్, జులై 20 ప్రభాతవార్త:



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు ప్రజల నుండి అందిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని టెలికాన్ఫరెన్స్ హాలులో సోమవారం మున్సిపల్ కమీషనర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై 9 అర్జీలు అందాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 7, ప్రధాన కార్యాలయం, పెన్షన్లకు సంబంధించి ఒకొక్క సమస్య అందింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎసిపి నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంలో దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

### – నల్లబ్యాడ్జీలతో నిరసన.. సేవా కేంద్రాలు వద్దు !!



కుప్పం, జూలై 20 ప్రభాతవార్త

రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ కుప్పంలో సోమవారం దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ చేపట్టారు. ఈసందర్భంగా కార్యాలయ ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో రిజర్వేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయరాదన్నారు. రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేట్ పరం చేయరాదని డిమాండ్ చేశారు. ఇలా చేస్తే దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం దస్తావేజు లేఖరుల లైసెన్సులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.జిఓ నెం 396ను వెంటనే ప్రభుత్వం ఉపస ంహరించుకోవాలన్నారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు పెన్‌డౌన్ చేపడుతున్నట్లు చెప్పారు. అన ంతరం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.దస్తావేజు లేఖరులు మహేంద్ర, చెంగప్ప స్వామి, పార్థసారథి,జగన్నాథరెడ్డి,చిదంబరం,చిరంజీవి, జయకుమార్,రామస్వామితోపాటుపలువురు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డులను అందుకొన్న విజయం విద్యార్థులు



చిత్తూరురూరల్, జూలై 20 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను విజయం విద్యాసంస్థలకు చెందిన నలుగురు విద్యార్థులు సొంతం చేసుకొన్నట్లు సంస్థ అధినేత డా.ఎం.తేజోమూర్తి తెలిపారు. పదవతరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ చూపి 597మార్కులు సాధించిన విజయం స్కూల్ విద్యార్థిని సి క్రిష్ణప్రియ, ఇంటర్‌ఫలితాల్లో విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు ఎం డింపుల్ భవ్యశ్రీ, సి సోమంత్‌కుమార్, బి ఎస్సాకిల్‌లకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సన్మాన, అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యుల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత ఎం. తేజోమూర్తితో పిటు అకడమిక్ డైరెక్టరు డా.ఎం.శైలజమూర్తిలు అభినందించారు.

# రాష్ట్ర స్థాయిలో ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



తిరుపతి విద్య, జూలై 20 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్-2026 పురస్కారాలకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుగాలి రామ్ చరణ్ నాయక్ మరియు ప్రత్యేక ప్రతిభావంతుల విభాగంలో షేక్ మహమ్మద్ అలీ అవార్డులు అందుకున్నారు. తిరుపతిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డా. దరిశ గోపాలరెడ్డి చేతుల మీదుగా ఇద్దరు విద్యార్థులకు రూ.20 వేల నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఎంఈసీ గ్రూపులో 944 మార్కులు సాధించిన సుగాలి రామ్ చరణ్ నాయక్, నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షలో రెండో ర్యాంకు సాధించి బీఎస్సీ డేటా సైన్స్ కోర్సులో ప్రవేశం పొందాడు. అలాగే సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రవేశ పరీక్షలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 112వ ర్యాంకు సాధించాడు. భవిష్యత్తులో ఐఏఎస్ అధికారి కావడమే తన లక్ష్యమని తెలిపాడు. హెచ్ఈసీ గ్రూపులో 844 మార్కులు సాధించిన షేక్ మహమ్మద్ అలీ ప్రత్యేక ప్రతిభావంతుల విభాగంలో షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో చేరిన ఆయన, భవిష్యత్తులో బ్యాంకు అధికారిగా స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు. అవార్డు గ్రహీతలను కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు, అధ్యాపకులు కోలా కృష్ణ కిశోర్, పి.జి. లావణ్యతో పాటు అధ్యాపక బృందం అభినందించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల మార్గదర్శకత్వమే కారణమని వారు పేర్కొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆవిష్కరణల దిశగా యస్వీయూ మరో ముందడుగు

### రూసా ఫేజ్-2 ఆధ్వర్యంలో ఆరు రోజుల ఎఫ్‌డీపీ ప్రారంభం

తిరుపతి విద్య, జూలై 20 ప్రభాత వార్త




శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్, స్టార్టప్ ఎకోసిస్టమ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ - ఎంపవరింగ్ ఎడ్యుకేటర్స్ టు బిల్డ్ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ అంశంపై సోమవారం ఆరు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్‌డీపీ) ప్రారంభమైంది. రూసా ఫేజ్-2 పరిధిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ వైరస్ లైక్ పార్టికల్స్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 25 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు ప్రారంభించి, విద్యార్థుల వినూత్న ఆలోచనలను ఆవిష్కరణలు, స్టార్టప్‌లుగా తీర్చిదిద్దడంలో విశ్వవిద్యాలయాలు, అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. రెక్టార్ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ, విద్యార్థులను వ్యవస్థాపకత, స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడంలో అధ్యాపకుల బాధ్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి మాట్లాడుతూ, ఇటువంటి శిక్షణలు విద్యార్థుల్లో ఆచరణాత్మక నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ రవి ఈశ్వరపు కీలకోపన్యాసం చేస్తూ, ఉన్నత విద్యాసంస్థలు ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్, స్టార్టప్‌లకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. కార్యక్రమ నిర్వహకురాలు ఆచార్య ఎం. హేమ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలో స్టార్టప్ వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యార్థులు, పరిశోధకుల ఆలోచనలను వ్యాపార ప్రణాళికలుగా మలచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు చెందిన అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి : యుటిఎఫ్

పెనగలూరు, జూలై 20 ప్రభాతవార్త



మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు యుటిఎఫ్ పెనగలూరు మండల శాఖ ఆధ్వర్యంలో పదివేల రూపాయలు విలువ చేసే పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిల్స్, ఎరేజర్స్, షార్ప్ నర్స్, బలపాలు మొదలైన విద్యాసామాగ్రి పంపిణి చేశారు. మండలంలోని నాయుడువారి పల్లి యస్ టి కాలని, కొండూరు యస్ టికాలని, తూర్పుపల్లి, వెలగచెర్ల హరిజనవాడ, వియం పురం, కొండూరు, తిరుణం పల్లి హరిజనవాడ, తిరుణం పల్లి, సిరివరం, కొత్తపల్లి, ఓదేటివారి పల్లి గ్రామాల పాఠశాలలకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఐ.గంగాధర్ బాబు, పి. వెంకట సుబ్బయ్య లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పని సంస్కృతి, అంకిత భావంతో మెలగాలని, బడిపై నమ్మకం కలిగేలా ప్రయత్నించాలని కోరారు. గ్రామ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఊరి బడి అభ్యున్నతికి ముందుకు రావాలని కోరారు. యుటిఫ్ నాయకులు బి. హరి ప్రసాద్, పి. శ్రీనివాస కుమార్, యం. నరసింహారావు మాట్లాడుతూ పాఠశాల విద్యా రంగంలో మార్పులు పేరుతో చేసే చర్యలు పాఠశాలలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, రాను రాను పాఠశాలలు బలహీన స్థితిలోకి నెట్టబడుతున్నాయని అన్నారు. మూడో వంతు ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా రూపాంతరం చెందాయన్నారు. వెంటనే ఉపాధ్యాయుల లోటు గల పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలని లేకపోతే బడుల మనుగడ కష్టమని ఆవేదన చెందారు. ఉపాధ్యాయులు తమదైన శైలిలో కష్టపడుతూ పాఠశాలలను కాపాడుకుంటూ వస్తున్నారని వారిని ప్రోత్సాహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రమోద్ కుమార్ రెడ్డి, శ్రీనివాస రావు, శ్రీకాంత్, శ్రీనివాసులు, వెంకట రమణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రాంబాబు, గిరి, హరి ప్రసాద్, శిరీష, అనురాధ, సుభాషిణి, రాధ, మురళి కృష్ణ, రజిత, అఫ్రీన్, వెంకటేష్, రమణయ్య, భారతి, వెంకట సుబ్బయ్య, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ద్రౌపది అమ్మవారి కళ్యాణం

రామచంద్రాపురం, జూలై 20 ప్రభాతవార్త:



ఎన్ఆర్ కమ్మపల్లిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో సోమవారం ద్రౌపధి అమ్మవారి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మేళ తాళాలు, మంగళ వాయిధ్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ పౌరోహితులు మాడభూషిత రాజగోపాలయ్యం గార్, ప్రదీప్ అయ్యంగార్ల బృందం కళ్యాణ తంతును సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయ మాజీ అర్చకులు దివంగత బ్రహ్మర్షి వెంకటరత్నం ఆచ్చారి దివ్యాశిస్సులతో ప్రధాన అర్చకులు హరి స్వామి, అరవింద్ ఆచ్చారుల శిష్య బృందం వివిధ రకాల పుష్పాలతో కళ్యాణ వేధికను అలంకరించారు. కళ్యాణ మండపాన్ని విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు. అమ్మగారి పల్లికి చెందిన సుబ్బరామానాయుడు, తులశమ్మ కుటుంబ సభ్యులు సతీష్, లైలా దంపతులు అమ్మవారి కళ్యాణానికి ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం భాగవతారిణి స్వర్ణలత ద్రౌపధి స్వయంవరం హరికథను భక్తులకు తన గాణ కచేరిచే చక్కగా వినిపించారు.

## మోటార్ మెకానిక్ యూనియన్‌కు స్థలం కేటాయిస్తాం

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి విద్య, జూలై 20 ప్రభాతవార్త

1993 నుంచి సొంత స్థలం కోసం ఎదు రుచూస్తున్న తిరుపతి మోటార్ మెకానిక్ యూనియన్‌కు త్వరలో శాశ్వత స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. యూనియన్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తిరుపతి, ఆటోనగర్ లేదా మంగళం పరిసర ప్రాంతాల్లో యూనియన్‌కు అనువైన స్థలాన్ని గుర్తించి, జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత రెవెన్యూ అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా కేటాయించేలా కృషి చేస్తానన్నారు. మెకానిక్‌లకు గుర్తింపు కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు మునిరెడ్డి మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా సొంత కార్యాలయం కోసం చేస్తున్న పోరాటానికి ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో సభ్యుల్లో కొత్త ఆశలు చిగురించాయని తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు మెకానిక్‌లకు యూనియన్ తరఫున ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందజేయడం తమ సేవా కార్యక్రమాల్లో భాగమన్నారు. మరమ్మతుల కోసం ఇచ్చిన వాహనాలను నెలల తరబడి తీసుకెళ్లకుండా వివాదాలు సృష్టించే ఘటనలను అరికట్టేందుకు యూనియన్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మునిరెడ్డి, కార్యదర్శి ఎన్. గురునాథచారి, జాయింట్ సెక్రటరీ పి. తేజారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభు, గౌరవ అధ్యక్షుడు జలంధర్, ట్రెజరర్ గౌస్‌బాషా, కమిటీ ఇన్‌చార్జిలు కేశవాచారి, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జేబీఆర్ విద్యార్థి జగదీష్‌కి రాష్ట్ర స్థాయి షైనింగ్ స్టార్ అవార్డు

నాగలాపురం, జూలై 20 ప్రభాతవార్త:



పిచ్చాటూరు మండలంలోని జేబీఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థి జగదీష్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం శ్రీ పద్మావతి యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డు కార్యక్రమంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా జగదీష్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థికిగోల్డ్ మెడల్ రూ.20 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రంను అందజేశారు. కార్యక్రమంలో జగదీష్ తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. విద్యార్థి ఈ ఘన విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందాన్ని నిరంతరం ప్రోత్సహించిన తల్లిదండ్రులను, జేబీఆర్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని పిచ్చాటూరు మండల విద్యాశాఖ అధికారి హేమమాలిని అభినందించారు. ఈ సందర్భంగా జేబీఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మునిరత్నం మాట్లాడుతూ జగదీష్ సాధించిన ఈ విషయం విద్యార్థులందరికి స్ఫూర్తిదాయకమని, భవిష్యత్‌లో మరింత మంది రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా విద్యాసంస్థ కృషి చేస్తుందని తెలిపారు.

## 10 వేల పోలీస్ పోస్టులతో మెగా నోటిఫికేషన్ ఇవ్వాలి



తిరుపతి విద్య, జూలై 20 ప్రభాతవార్త

రాష్ట్రంలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల సంఖ్యను పెంచి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని వైయస్సార్ విద్యార్థి విభాగం ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షుడు మన్నం ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎస్వీయూ కి విచ్చేసిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో ప్రభుత్వం ప్రకటించిన 2,700 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు సరిపోవని పేర్కొంటూ ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. వెంటనే 10 వేల పోస్టులతో మెగా పోలీస్ నియామక నోటిఫికేషన్ విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. మన్నం ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉద్యోగాల కోసం యువత ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. నిరుద్యోగయువతసమస్యలనుమాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, శాసన మండలిలో ఈ అంశంపై గళం విప్పి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొని తమ సమస్యలనుఎమ్మెల్సీకివివరించారు. విద్యార్థినాయకులులిఖిత, పవన్, కిషోర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లలు బడిబాట.

చిట్వేలి, జూలై 20 ప్రభాతవార్త:



పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాల ప్రకారం డీఈవో సూచనలు మేరకు మండల విద్యాశాఖ అధికారులు ఖాజా మొహిద్దిన్, ఈశ్వరయ్య క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయుడు బి.దుర్గరాజు ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని గట్టుమీద పల్లె గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లలను ఉన్నత పాఠశాలలో చేర్పించడం జరిగిందని సిఆర్ఎంటి చంద్రశేఖర్ తెలిపారు. చదువును ఆపి పాఠశాలకు దూరంగా ఉన్న ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఒంటెల పెంచలమ్మ, ఆరో తరగతి ఆవుల శివాని వారి కుటుంబ సభ్యులకు చదువు ఆవశ్యకతను, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరించి తిరిగి పాఠశాలలో చేర్పించామని, వారికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను అందించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, జీవ శాస్త్ర ఉపాధ్యాయురాలు సుహాసిని, గట్టుమీద పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు రద్దు చేయాలని ధర్నా

చిట్వేలి, జూలై 20, ప్రభాతవార్త:



రాష్ట్రంలో స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలు అన్నింటిని ప్రైవేటు పరం చేసి రిజిస్ట్రేషన్ సర్వీసు కేంద్రాల ఏర్పాటు దిశగా ఆలోచిస్తున్న కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని చిట్వేలి సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలోని దస్తావేజులేఖరులు డిమాండ్ చేశారు ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పెన్ డౌన్ కార్యక్రమంలో భాగంగా వారు ఆదివారం చిట్వేలి సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ డిఎంపి కుమారికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా ప్రజల ఆస్తులకు రక్షణ ఉండబోదన్నారు. కీలకమైన భూ రికార్డులన్నీ భద్రతకు నోచుకోక ప్రజల ఆస్తులు గాలిలో దీపంలా మారే అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తరతరాలుగా కొనసాగుతున్న దస్తావేజులు లేఖరుల వ్యవస్థకు జీవో నెంబర్ 396 ముప్పుగా వారు అభివర్ణించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహించాలని తలపెట్టడంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. దాని ఫలితాన్ని ఆ ప్రభుత్వం అనుభవించిందని కూటమి ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఆమోదిస్తే ఆ ప్రభావాన్ని ఎన్నికల్లో చూడవలసి ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు సమ్మెట వీరాంజనేయులు రాజు, పిడుగు సుబ్బరాయుడు, తొంబరపు వెంకటేశ్వర్లు, శివ శంకర్, మురళి, ప్రసాద్ , నజీర్, వంశీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్వేటినగరంలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్

కార్వేటినగరం, జూలై 20 ప్రభాతవార్త:

కార్వేటినగరం సబ్-రిజిస్ట్రర్ కార్యాలయం ఎదుట సోమవారం దస్తావేజు లేఖర్లు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపి పెన్‌డౌన్ కార్యక్రమం చేశారు. ఈ సంధర్భంగా దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జిఓ నెం.396ను ఉపసంహారించుకోవాలని కోరారు. గత కొన్నిఏళ్ళుగా దస్తావేజు లేఖర్లు వృత్తిని నమ్ముకొని కుటుంబాలను పోషించుకొంటున్నామని, ప్రభుత్వం ప్రయివేటీకరణ చేస్తే ఆ కుటుంబాలు వీధినపడే అవకాశం మెండుగా వుందని అన్నారు. పెన్‌డౌన్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. పెన్‌డౌన్ కార్యక్రమాన్ని డాక్యుమెంట్‌రైటర్లు, వెండర్లు, డేటా ఆపరేటర్లు మూకుమ్మడిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కోదండయ్య, తులసీరాం, మునిప్రసాద్, సుందరం, శోభ, మోహన్‌రెడ్డి, కోమల, మోతీలాల్, కృష్ణయ్య, చంద్రశేఖర్, మురళి, హేమంత్, శేఖర్, మునిరత్నం, దేవి, పద్మ, మల్లిక, దినేష్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## మండల టాపర్లకు చెక్కులు పంపిణీ

పుల్లంపేట, జూలై 20 ప్రభాతవార్త :



పుల్లంపేట మండలంలో 2026 సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు సోమవారం తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో పదవ తరగతి విద్యార్థులకు తిరుపతి జిల్లా కలెక్టర్, రైల్వే కోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ చేతుల మీదుగా 20 వేల రూపాయల చెక్కులను శ్రీ ప్రత్యూష హై స్కూల్ విద్యార్థులు బోధనపు అబిదా, ఎస్ సుహానా, లకు పంపిణీ చేశారు, వీరికి ప్రశంసా పత్రము, మెడల్ లను అందించారు, ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భాను ప్రసాద్, ఉపాధ్యాయులు రహిమాన్, సురేష్, కృష్ణ, రాధా, మహబూబ్బి, నాగలక్ష్మి పవిత్ర రజని శ్రావణి శ్రీలత రెడ్డమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- డాక్టర్ సి. రమేష్

రొంపిచర్ల, జూలై 20, ప్రభాతవార్త



విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలని రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.రమేష్ పిలుపునిచ్చారు. చట్నా నారాయణ 22వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం రొంపిచర్లలో విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి. రమేష్ మాట్లాడుతూ తమ తండ్రి చట్నా నారాయణ జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం, వారిలో పోటీ తత్వాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన మరో 15 మంది విద్యార్థులకు జీహెచ్ ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అమరశేఖర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డి ప్రదీప్, ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పరమేశ్వర్, జీహెచ్ ప్రసాద్, సోము రవికుమార్,

## అతుకుబడి పట్టాలపై గ్రామ సభలు..

రైల్వేకోడూరు రూరల్, జూలై 20 ప్రభాతవార్త




మండలంలోని అతుకుబడి పట్టాలపై ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సందర్భంలో స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే అతుకుబడి పట్టాల వివరాలను నివేదికలను వేగవంతంగా పంపించాలని ఆదేశించినట్లు రైల్వేకోడూరు తాసిల్దార్ కోనేటి అమర్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట, ఉప్పరపల్లి, మైసూరువారిపల్లి గ్రామాలలో సోమవారం గ్రామసభలను నిర్వహించి రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. రైతులందరూ అతుకుబడి నెంబర్ల చెక్ చేసుకునే విధంగా సంబంధిత రైతులు వేగవంతంగా నివేదికలను సంబంధిత వీఆర్వోల ద్వారా అందజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి గల్లా రమణ, వీఆర్వో దర్బార్ భాష రైతులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలకు వేదికగా ఇన్వెస్టిట్యూర్ వేడుక

తిరుపతి విద్య, జూలై 20 ప్రభాతవార్త




తిరుపతి ఎస్ ఎం పి ఎస్ బాయ్స్ కంపాస్ విద్యార్థి నాయకుల పదవీ స్వీకార కార్యక్రమం (ఇన్వెస్టిట్యూర్ వేడుక) ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లీలాధర్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా డి జి ఎం కొండలరావు ,ఏ జి ఎం శ్రీనివాసులు, ఆర్ ఐ ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అతిథులు, నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు బ్యాడ్జిలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏ జి ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. బాధ్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇన్వెస్టిట్యూర్ వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ స్కిల్ ట్రైనర్ మోహన్, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో "ప్రకృతి వ్యవసాయ పద్ధతులు"

### ఎల్‌నినో నివారణకు ప్రభుత్వ పథకాలు దోహదం, ఏఓ విజయభాస్కర్



చంద్రగిరి, జూలై 20 ప్రభాతవార్త:

రాయలసీమ జిల్లాల్లోని వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సాయపడతాయని మండల వ్యవసాయ అధికారి సి.విజయభాస్కర్ అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన ఈ మేరకు వివరించారు. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.5 డిగ్రీల సెల్సియస్ నుండి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగడం వల్ల ఏర్పడే ఒక సహజ వాతావరణ పరిణామం అన్నారు. దీనివలన గాలులు మేఘాలుగా మారి వర్షాలు తక్కువగా కురుస్తాయన్నారు. ఇదే రైతుల భాషలో చెప్పాలంటే సముద్రం వేడెక్కి వర్షాలు తగ్గి పాడి పంటలకు నష్టం జరుగుతుందన్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వర్షపాతంలో వ్యత్యాసాలు ఏర్పడతాయన్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతుల కోసం ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ శాఖలతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నీటి కొరత వున్న ప్రాంతాలలో తక్కువ నీటితో సాగు చేసే పంటలు ప్రకృతి వ్యవసాయ పంటలు, వర్షపునీటి సంరక్షణ, సూక్ష్మ పోషకాల వినియోగం వంటి ప్రభుత్వ పథకాల సహాయంతో ఎల్‌నినో ప్రభావాన్ని నివారించవచ్చున్నారు. ఖరీఫ్ 2026-27 సంవత్సరానికి తిరుపతి జిల్లాలో దిగుబడి ఆధారిత భీమా పథకం (పిఎంఎఫ్‌బివై) ద్వారా వరి, సజ్జ పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత భీమా పథకం (ఆర్‌డబ్ల్యుబిసిఐఎస్) ద్వారా వేరుశెనగ, నిమ్మ పంటలు ఎంపిక చేయబడినట్లు తెలిపారు. బ్యాంక్‌లో వ్యవసాయ రుణాలు తీసుకోని రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, వన్‌బి ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో తీసుకుని సిఎస్‌సి సెంటర్‌కు వెళ్ళి వివరాలను తెలుసుకుని ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు.

## పిజిఆర్ఎస్‌కు క్యూఆర్ కోడ్ వినియోగించాలి

పుల్లంపేట, జులై 20 ప్రభాతవార్త :

మండలంలోని పిజిఆర్ఎస్ సేవలపై ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్ వినియోగించాలని మండల అభివృద్ధి అధికారిని పి జయశ్రీ, తెలిపారు మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే పి జి ఆర్ ఎస్ సమావేశాలకు హాజరయ్యే ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమర్పించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్ ను ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సేవలపై తమ అభిప్రాయాలను నమోదు చేసి, ప్రజా సేవల మెరుగుదలకు సహకరించాలని ఎంపీడీవో కోరారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## బత్తినయ్య కోనలో పవన్ పేర పూజలు



శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త: జనసేన అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని విధులకు హాజరు కావాలని ప్రజా సంక్షేమానికి, ప్రజలతో మమేకం కావాలని కోరుకుంటూ మహిమాన్విత బత్తినయ్య కోనలో వెలసిన శివయ్యకు పవన్ అభిమాని జనసేనాని దండి నరేంద్ర పూజలు జరిపారు. దండి నరేంద్ర ఈ మహిమను తెలుసుకొని సోమవారం వేకువ జామున కొండ ఎక్కి ఆలయం వద్ద శివయ్యను భక్తితో మోకరిల్లి పూజలు జరిపారు. పవన్‌కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రజాక్షేత్రంలో సేవలందించాలని పూజలు జరిపారు.

## డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండికి 56 వినతులు

తిరుపతి,జూలై 20ప్రభాతవార్త:ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండికి 56 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారులకు విన్నవించారు. ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి ఈ కార్యక్రమం ద్వారా వినియోగ దారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## పరిమళకి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి, జులై 20 ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని కె.పరిమళకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. అనురాధ తెలిపారు. ఈమె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు చెందిన ఆచార్య జి. రజిత, మార్గదర్శకత్వంలో "డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ బయో అనలిటికల్ అనలిటికల్ మెథడ్స్ ఫర్ ది ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ బల్క్ డోసేజ్ ఫార్మ్ బై యూజింగ్ లిక్విడ్ క్రోమాటోగ్రాఫిక్ టెక్నిక్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకుగాను పరిశోధన విద్యార్థిని కె.పరిమళకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. కె.పరిమళ కి డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

## తిరుపతి టౌన్ బ్యాంక్ ఉద్యోగులకు పిఆర్‌సి



తిరుపతి, జులై 20 ప్రభాతవార్త: తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు 2015 పిఆర్‌సి జీతభత్యాల కోసం గత 117 రోజులుగా చేస్తున్న శాంతియుత నిరాహార దీక్షలు ఎట్టకేలకు ఒక చారిత్రాత్మక విజయంతో సోమవారం ముగిశాయి. ఉద్యోగుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ప్రభుత్వం అధికారికంగా జిఓవిడుదల చేసింది. ఈ సమాచారంతో టౌన్ బ్యాంక్ ఉద్యోగుల ఆనందం వ్యక్తం చేశారు. టిడిపి నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం ప్రయత్నం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడుల చొరవతో జిఓ విడుదలైంది. పిఆర్‌సి కోసం ఉద్యోగులు ఆందోళనలో 7వ రోజున ఉద్యోగులను డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం పరామర్శించారు. జిఓ విడుదలవడంతో ఉద్యోగులు ఆనందంతో డాక్టర్ బాలసుబ్రహ్మణ్యంను, టిడిపి నేతలు వి.పుష్పావతియాదవ్, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి సంతోషాన్ని వ్యక్తపరిచారు. తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు, యూనియన్ నాయకులు ముని ప్రభాకర్, శ్రీనివాస్, ఆనంద్, గిరిధర్, చంద్రబాబు, సురేష్, గోవిందమ్మ, బాలాజీ, ఉమ, మహేశ్వరి, నీరజ, లతీష్, హరికృష్ణ, జ్యోతీశ్వర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సవాన్ని జరుపుకున్నారు.

## కాలి నడక గోవిందమాల భక్తులకు అన్నదానం



నారాయణవనం, జూలై 20 ప్రభాతవార్త : తమిళనాడు రాష్ట్రం నుంచి తిరుమల శ్రీవారి దర్శనం కోసం కాలి నడకన నడిచే వెళ్లే భక్తులకు మండలకేంద్రంలోని నారాయణవనం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదురుగా పుమారు 150మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ముందు స్వామి వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి, టెంకాయ హారతులు పట్టారు. అనంతరం గోవిందమాల ధరించిన భక్తులకు అన్నదానం అందించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని గత 14 ఏళ్లుగా అందిస్తున్న తెలిపారు. అన్నదానం అందించిన వారిలో రేషన్ డీలర్ కందస్వామి, రవికుమార్, కేబుల్ టివి గిరిబాబు, స్థానికులు పాల్గొన్నారు.

## మేకల చోరీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

సత్యవేడు, జూలై 20 ప్రభాతవార్త: మండలంలోని మదనంబేడు గ్రామంలో చోటు చేసుకున్న మేకల చోరీ కేసుకు సంబంధించి నిందితులు రాకేష్(22), మునివేలు(20) ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు 50 వేలు విలువ చేసే రెండు మేకలు ఒక ద్విచక్రవాహనాన్ని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సాయినాథ్‌చౌదరి మాట్లాడుతూ మదనంబేడు గ్రామంలో జూలై 18వ తేదీ వేకువ జామున రెండు గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ముగ్గురు వచ్చి బాలి మునస్వామి ఇంటి పెరడులో కట్టి ఉంచిన రెండు మేకలను అపహరించుకుని వెళ్లారన్నారు. దీనిపై బాధితుడు మునస్వామి జూలై 19వ తేదీ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై దర్యాప్తు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో జూలై 20న దాసుకుప్పం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా ద్విచక్రవాహనంపై మేకలు తీసుకుని వెళుతుండగా వారిని ఆపి విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. మదనంబేడు గ్రామంలో మేకలు దొంగతనం చేసినట్టు నేరాన్ని అంగీకరించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.ఈ సమావేశంలో ఎస్ఐ లావణ్య, పోలీసులు బుజ్జిబాబు, ప్రతాప్,మార్కండేయులు,పద్మనాభరెడ్డి,హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నేత గవర్ల జన్మదిన వేడుకలు



కేవీబీ పురం, జూలై 20 ప్రభాతవార్త: మండల కేంద్ర మైన కేవీబీ పురంలో వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు అకాడమి డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి సత్యవేడు నియోజక వర్గ వైసీపీ నాయకులు నూకతోటి రాజేష్ పాల్గొని కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. అంతకు ముందు గవర్ల కృష్ణయ్య, నూకతోటి రాజేష్‌లు కేవీబీపురంలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేసి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం వైసీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. అలాగే కేవీబీపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూకతోటి రాజేష్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ పార్టీ వచ్చే విధంగా ఎప్పుడు ఎలెక్షన్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో మండల ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్, వైస్ ఎంపీపీలు దేరాల శ్రీనివాసులు శెట్టి, సరస్వతీ, రమేష్, జడ్పీటీసీ మూర్తి, మునెమ్మ, ఢిల్లీ, మాజీస్టేట్ ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ పాడి లాల్‌బాబు యాదవ్, పర్వతాల బాలసుబ్రహ్మణ్యం, స్థానిక సర్పంచ్ కరపారెడ్డి, గిరి రెడ్డి, ఎంపీటీసీ అయ్యప్పరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గౌనిపురం రామువర్మ, మండల మైనారిటీసెల్ అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, మండల యువత అధ్యక్షుడు అమరంవేడు మణి, మండల మహిళా అధ్యక్షురాలు రమాప్రభ, క్లస్టర్ ఇన్‌ఛార్జి నగరం లోకేష్, పూడి మణి, చిరంజీవి, దిగువ పుత్తూరు సర్పంచ్ బాలాజీ, మారపురెడ్డి కండ్రిగ సర్పంచ్ మనీ, రామారావు, సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటరత్నం, వైసీపీ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పిచ్చాటూరు మండల పార్టీ అధ్యక్షులు, నాగలాపురం ఎంపీపీ, పరిసర గ్రామాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

తిరుపతి హెల్త్, జూలై 20 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి రాజీవ్ నగర్ జీవకోన5 అర్బన్ పిహెచ్సీలో రాజీవ్ నగర్ జీవకోన 4,5 సచివాలయాల పరిధిలోని ప్రజలకు పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై డాక్టర్లు చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి.

## బిజెపి జాతీయ కార్యదర్శి రాహుకేతు పూజలు



శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను సోమవారం బిజెపి జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ జరిపించుకున్నారు. ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం ఏర్పాటు చేసారు. ఆయనతో పాటు యుపి శాసనమండలి సభ్యుడు అశోక్ కటారియా,వెంకటేశ్వర యూనివర్సిటి చైర్మెన్ సుధీర్‌గిరి,అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంజయ్ బాటియాలు వచ్చారు. రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు.ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్ పెక్టర్ హరియాదవ్, పర్యవేక్షకుడు నాగభూషణయం యాదవ్‌లు, బిజెపి ప్రతినిధి చందు రాయల్ పర్యవేక్షించారు.

**కోలా ఆనంద్‌చే సత్కారం:**

శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని భక్తి శ్రద్దలతో దర్శించుకొని రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న జాతీయ బిజెపి కార్యదర్శి సునీల్ బన్సల్‌ను అతిధి గృహంలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్ దుశ్శాలువతో సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుదర్శనం ఏర్పాటు చేసిన కోలా ఆనంద్‌ను బన్సల్ అభినందించారు.

## లారీ బోల్తా...డ్రైవర్‌కు గాయాలు




తొట్టంబేడు, జూలై 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నంది సర్కిల్ ఫ్లైఓవర్ వద్ద సోమవారం లారీ బోల్తా పడిన ఘటన జరిగింది.తొట్టంబేడు ఎస్సై బి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం స్క్రాప్ ప్లాస్టిక్ లోడుతో వెళ్తున్న లారీ ఫ్లైఓవర్ పైకి ఎక్కే సమయంలో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో లారీలో భారీగా స్క్రాప్ ప్లాస్టిక్ సామగ్రి ఉండటంతో అవి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి.ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స నిమిత్తం సహాయం అందించారు. ప్రమాదం కారణంగా కొంతసేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గురవారెడ్డికి గ్రామస్తుల ఘన స్వాగతం



ఏర్పేడు, జూలై 20 ప్రభాతవార్త: గ్రంథాలయాల అభివృద్ధి, విద్యాభివృద్ధి సమాజ సేవకు గుర్తింపుగా బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పురస్కారం అందుకున్న టిడిపి సీనియర్ నేత, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, రెడ్డివారి గురవారెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామం కూడలి వద్ద మహిళలు పెద్ద ఎత్తున గురవారెడ్డికి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్, పార్టీ నాయకులు శంకర్ రెడ్డి, భక్తిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చిరంజీవులు, మునిరత్నం తదితరులతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు కల్పించాలి



శ్రీకాళహస్తి, జూలై 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి రూరల్ మండలం ఊరందూరు, నారాయణపురం పంచాయతీల్లోని వ్యవసాయ కూలీలకు వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీస్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కేవీపీస్ ఆధ్వర్యంలో సామాజిక శంఖారావంలో భాగంగా సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద దళితుల సమస్యలపై ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఊరందూరు, నారాయణపురం పంచాయతీలను శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో కలిపిన కారణంగా, జింగిలిపాలెం, పెంకులపాడు గ్రామాలతో కలిపి గత ఐదేళ్లుగా ఆ గ్రామాలకు ఉపాధి పనులు కల్పించడం లేదని ఆరోపించారు.మున్సిపాలిటీలో కలపొద్దని గ్రామస్తులు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నా అధికారులు ఉపాధి పనుల కల్పనలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా తొట్టంబేడు మండలం చేమూరు దళితులకు 2006లో డీకేటి భూములు పంచి పట్టాలు ఇచ్చినా, ఇప్పటివరకు ఆన్‌లైన్ చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంధం మణి, కేవీపీస్ నాయకులు పెనగడం గురవయ్య, వెలివేంద్రం, కుమార్, వెంకటేష్ ఊరందూరు, చేమూరు దళితులు పాల్గొన్నారు.

## పంట కాలువను కాపాడాలి



శ్రీకాళహస్తి రూరల్, జూలై 20 ప్రభాతవార్త: హిందుస్థాన్ కోకా కోలా బేవరేజస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రైతుల పంట కాలువను కబ్జా చేస్తుందని ఆరోపిస్తూ ఏపీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిజెఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుకి వినతిపత్రం అందజేశారు. రైతుల సాగునీటి అవసరా లకు ఉపయోగపడే పంట కాలువను కంపెనీ ఆక్రమిస్తుందని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి పంట కాలువను కాపాడి, రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## జీవో 396 రద్దు చేయాలి

### -దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ ఉద్యమం



తొట్టంబేడు, జూలై 20 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు తొట్టంబేడులో సోమవారం దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ ఉద్యమాన్నిప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు 12 రోజుల పాటునిరసన కొనసాగుతుందని సంఘ నాయకులు తెలిపారు. ఉద్యమంలో భాగంగా దస్తావేజుల తయారీ, రిజిస్ట్రేషన్ పనులను పూర్తిగా నిలిపివేశారు. ప్రైవేటు పరం చేస్తే ప్రజల ఆస్తులకు ముప్పుఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ, దస్తావేజుల తయారీని ప్రైవేట్ సేవా కేంద్రాలకు అప్పగించడం వల్ల ప్రజల ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తప్పుడు రిజిస్ట్రేషన్లు, మోసాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్యమంలో స్థానిక దస్తావేజు లేఖరులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

## వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం

ఏర్పేడు, జూలై 20 ప్రభాతవార్త: యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలోని ఆదర్శ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందజేశారు. తిరుపతి, రామాపురం గ్రామానికి చెందిన సమీరా తండ్రి మస్తాన్ వర్ధంతి సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు వంశీ, యుగంధర్, వెంకటేష్, భాస్కర్, దాము తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు యువ నేస్తం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆన్‌లైన్ విక్రయాలు నిలిపివేత : కాంగ్రెస్‌పార్టీ

శ్రీకాళహస్తి జూలై 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో గత కొంతకాలంగా అమలు చేస్తున్న ప్రసాదాల ఆన్‌లైన్ విక్రయాలను నిలిపివేసి, మునుపటిలాగే నగదు రూపంలో సాధారణ విక్రయాలు ప్రారంభించడం కాంగ్రెస్ పార్టీ పోరాట ఫలితమే అని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ విక్రయాల నేపథ్యంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రసాదాలు అమ్ముడుపోక నేలపాలవుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశామని చెప్పారు.ఈ పోరాట ఫలితంగానే నేడు ప్రసాదాలను సాధారణంగా విక్రయిస్తుండటం సంతోషకరమని అన్నారు.

## 969 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ



శ్రీకాళహస్తి, జూలై 20 ప్రభాతవార్త : సైనింగ్ స్టార్స్ 2026కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని టి. గంగాభవాని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకుంది. సీఈసీ గ్రూప్‌లో రెండవ సంవత్సరం పూర్తి చేసిన గంగాభవాని 969 మార్కులు సాధించింది. ఈ ఘన విజయానికి గాను ఆమెకు రూ.20,000 నగదు, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ అవార్డును మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో డీఈఓ, ఆర్.ఐ.ఓ గోపాల్ రెడ్డి, జూనియర్ లెక్చర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి, కళాశాల ప్రిన్సిపాల్ భారతి, జూనియర్ లెక్చరర్ శైలజ, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన ఎంజీఎం విద్యార్థి



శ్రీకాళహస్తి, జూలై 20 ప్రభాతవార్త : 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ ప్రోగ్రాంలో శ్రీకాళహస్తి ఎంజీఎం కళాశాల విద్యార్థి గోవింద్ కిషోర్ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యాడు. ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించినందుకు గోవింద్ కిషోర్ కు ప్రభుత్వం నుండి రూ.20 వేల నగదు, మెడల్, సర్టిఫికెట్.. బహుమతిని అందజేశారు.ఈ అవార్డును తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగానీ సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్లుచేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంజీఎం విద్యాసంస్థల డైరెక్టర్ డా. గుద్లూరు మయూర్‌మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎంజీఎం కాలేజ్ లో బాగా చదివి ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించిన విద్యార్థి ఈరోజు ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వి.ఎస్.రత్నం, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డైరీలు, పెన్నుల పంపిణీ

శ్రీకాళహస్తి జూలై 20 ప్రభాతవార్త: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు అక్కుర్తి ఆనంద రెడ్డి.రూపొందించిన డైరీలు,పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వి.ఎస్. మహేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, 180 మంది 10వ తరగతి విద్యార్థులకు.. డైరీలు, పెన్నులను తన చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వి.ఎస్. మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మిమ్మల్ని మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని అన్నారు.

## నిస్సహాయ గిరిజన కుటుంబానికి జనసేన అండ



తొట్టంబేడు, జూలై 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిస్సహాయ స్థితిలో ఉన్న గిరిజన కుటుంబానికి జనసేన పార్టీ నాయకులుఅండగా నిలిచారు. నిత్యవసర సరుకులు అందజేయడంతో పాటు, శాశ్వత జీవనోపాధి కోసం దుకాణము కట్టించి చిరువ్యాపారం పెట్టిస్తామని హామీ ఇచ్చారు.2026 జనసేన ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జనసేన నాయకులు దినేష్, లక్ష్మణ్ తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలోని ఒక గిరిజన కుటుంబాన్ని కలిశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇంటి పెద్దను ప్రమాదవశాత్తు కోల్పోయామని, తాను ఇద్దరు చిన్న పిల్లలతో అనాధగా మిగిలిపోయానని, ఇంటి జరుగుబాటు చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, లక్ష్మణ్, దినేష్, గంధం శ్రీను, మనీ, మహేష్, మునిచంద్ర, గోపి, వీర మహిళ శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత పాల్గొన్నారు.

## కన్నలి చెరువు ఆక్రమణపై అధికారుల విచారణ



తొట్టంబేడు, జూలై 20 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలోని కన్నలి చెరువు ఆక్రమణకు గురైందంటూ కథనాలు రావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్ర పరిశీలన చేపట్టారు. ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రకాష్ రావు, వీఆర్వో రవి, మండల సర్వేయర్ బృందం చెరువు వద్దకు చేరుకుని డీజీపీఎస్ పరికరాలతో చెరువు హద్దులను కొలతలు వేశారు. అధికారులు చెరువు మ్యాప్ ప్రకారం హద్దులు పరిశీలించి ఆక్రమణకు గురైన వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రకాష్ రావు మాట్లాడుతూ చెరువు ఆక్రమణపై ఫిర్యాదు అందడంతో సర్వే చేపడుతున్నామని తెలిపారు.చెరువును కాపాడాలని స్థానిక రైతులు అధికారులను కోరుతున్నారు.

## ఆర్టీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా న్యాయవాది రవి



తిరుపతి,జులై 20ప్రభాతవార్త: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్ ఆర్టీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా తిరుపతి కి చెందిన సీనియర్ న్యాయవాది బి. రవి నియమితులయ్యారు. ఈ మేరకు 12 మంది జాబితాతో కూడిన వివరాలను రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ విడుదల చేసింది. గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందిస్తున్న బి. రవి తిరుపతి జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆయన సేవలను గుర్తించి, రాష్ట్ర లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్ ఆర్టీఐ రాష్ట్ర కమిటీలో సభ్యుడుగా అవకాశం కల్పించి సముచిత స్థానం ఇచ్చింది. ఈ సందర్భంగా బి. రవి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి, రాష్ట్ర కమిటీలో సభ్యుడుగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి, ఎంపిలు,ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీకి, ప్రియాంక గాంధీకి, పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డికి, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్‌కి, ఏఐసీసీ కార్యదర్శి గణేష్ కుమార్ యాదవ్‌కి, లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వడ్డే సోమశేఖర్‌కి హృదయ పూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రవి తెలియజేశారు.

## సమస్యలపై ఇంచార్జీ మంత్రికి ఎమ్మెల్యే వినతి



నారాయణవనం, జూలై 20 ప్రభాతవార్త : తిరుపతి కలెక్టర్‌కి విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని టిడిపి అగ్ర నాయకులతో కలిసి పలు ప్రజా సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ప్రధానంగా సత్యవేడు డిగ్రీ కళాశాల భవన నిర్మాణం కొరకు, సత్యవేడు, నాగలాపురం, నారాయణవనంలో తహశీల్దారు కార్యాలయాలు, బిఎన్‌కండ్రిగ మండలం క్వారీ గుంతలో పడి చనిపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవడం కోసం, వరదయ్యపాలెంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకోవడం కోసం, కెవిబిపురం మండలం పాతపాలెం దళితవాడలో స్కూల్‌ను విలీనం చేయడాన్ని నిలిపి వేయడం, రాయలచెరువు విపత్తుతో కళ్లత్తూరు, ఇతర గ్రామాల ప్రజలను ఆదుకోవడం, సత్యవేడు మండలం చామర్తి కండ్రిగ సబ్‌స్టేషన్‌లో సిఫ్ట్ ఆపరేటర్ నియామకం వంటి పలు కీలక సమస్యలపై వినతిపత్రం అందించడంతో మంత్రి సానుకూలంగా స్పందించి తప్పక న్యాయం చేస్తామని హామి ఇచ్చారు. అలాగే జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వేంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు ఇళంగోవన్‌రెడ్డి, గోపినాథ్‌రెడ్డి, రవిరెడ్డి, లోకనాధరెడ్డి, కరుణాకర్‌నాయుడు, సుధాకర్‌నాయుడు, ఈశ్వరయ్య, యాచంద్రనాయుడు, నరేంద్ర, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపిపిలు మురళి, సుబ్రమణ్యం, దయాలన్ తదితరులు పాల్గొన్నారు.